# వచ్చే ఎన్నికల్లో సత్తాచాటుదాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

- పార్లమెంట్, స్థానిక సంస్థల ఎలక్షన్లలో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం
- అధికారం కోల్పోవడం స్పీడ్ బ్రేక్ మాత్రమే
- కేసీఆర్ అంటే నమ్మకం...బీఆర్ఎస్ అంటే విశ్వాసం
- ఎవరూ అధైర్యపడొద్దు.. భవిష్యత్ మనదే
- రైతుబంధు కింద 13 సార్లు రూ.72వేల కోట్లు ఇచ్చాం
- మెదక్ జిల్లాకు సింగూరు నీళ్లిచ్చాం
- రైతుబీమా దండగ అని మాట్లాడడం సిగ్గుచేటు
- సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు
- మెదక్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం

మెదక్, (నమస్తే తెలంగాణ)/ మెదక్‌రూరల్, డిసెంబర్ 27: తెలంగాణతో బీఆర్ఎస్‌ది పేగు బంధమని, కేసీఆర్ అంటే నమ్మకం, బీఆర్ఎస్ అంటే విశ్వాసమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని వైస్రాయ్ గార్డెన్స్‌లో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మెదక్, హవేళీఘణపూర్ మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, దేవేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ ఎన్నికల్లో కష్టపడి పనిచేశారని, కృతజ్ఞతలు చెప్పేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి గెలుపు ఓటములు కొత్తకాదని, ప్రజలు మార్పు కావాలని కాంగ్రెస్‌ను గెలిపించి, ఇప్పుడు బాధపడుతున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు మళ్లీ తానే వచ్చి ప్రచారం చేసి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఆరు అసెంబ్లీ స్థానాలు గెలిచామని, మీరంతా నా కుటుంబ సభ్యులే, మీకు ఏ ఆపద వచ్చినా నేనుంటానని భరోసానిచ్చారు. బీఆర్ఎస్ 20 గంటల కరెంటు ఇచ్చిందని అసెంబ్లీలో కాంగ్రెసోళ్లు చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.50వేల కోట్లు విద్యుత్ శాఖకు ఖర్చు చేసి రైతులకు ఉచిత కరెంటు ఇచ్చామని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు గోదావరి నీళ్లు తెచ్చి మెదక్ జిల్లాకు సింగూరు జలాలు ఇచ్చామని తెలిపారు. ఎప్పుడైనా కాంగ్రెసోళ్లు చెక్‌డ్యాంలు కట్టినారా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల పట్ల బీఆర్ఎస్ కమిట్‌మెంట్‌తో ఉన్నదని తెలిపారు. కాంగ్రెసోళ్లు అధికారం కోసం తహతహలాడుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ కోసం టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేశారని, అదే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక్కరు కూడా చేయలేదన్నారు.

**రైతుబంధు కింద 13 సార్లు రూ.72వేల కోట్లిచ్చాం..**

కరోనా వచ్చినా రైతులకు రైతుబంధు వేశామని, బీఆర్ఎస్ పాలనలో ఏ ప్రభుత్వ పథకం ఆగలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు గుర్తు చేశారు. రైతుబంధు కింద 13 సార్లు రూ.72వేల కోట్లు ఇచ్చామన్నారు. రైతుబీమా ప్రవేశపెట్టి రైతు కుటుంబాలకు అండగా నిలబడింది బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. కరోనా వచ్చినా, ఎన్ని విపత్తులు వచ్చినా బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు ఆగలేదని పేర్కొన్నారు. రైతుబీమా దండగ అని అసెంబ్లీలో కాంగ్రెసోళ్లు మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి, రైతుబీమా పథకాలు ఎన్నికల్లో హామీ ఇవ్వలేదని, అయినా వాటిని కొనసాగించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మ్యానిఫెస్టోలో 412 హామీలున్నాయని, వాటిలో ఎన్ని అమలు చేస్తారో.. ఎంత వరకు అమలవుతాయో చూద్దామని తెలిపారు.

**పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం...**

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదామని మాజీ మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో ఫేక్ వార్తలతో బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఏ కష్టం వచ్చినా అధైర్యపడొద్దని సూచించారు. మెదక్ ఎంపీ గెలవడం పక్కా అని, భవిష్యత్తు మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మెదక్‌లో ఓటమి స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని తెలిపారు. పాపన్నపేట మండలం ఏడుపాయల అభివృద్ధికి రూ.100 కోట్లతో జీవో ఇచ్చారని, అభివృద్ధి చేస్తారో లేదో చూద్దామని తెలిపారు.

**ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటా..**



– మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

తాను ఎన్నికల్లో ఓడిపోయినా ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామన్నారు. మెదక్ అభివృద్ధిని పట్టించుకోవాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రజల పక్షాన ప్రశ్నిస్తామన్నారు. కాంగ్రెసోళ్లు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు.

**అన్ని వర్గాలను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు**



– ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

పింఛన్లు, కల్యాణలక్ష్మి తదితర సంక్షేమ పథకాలను తీసుకొచ్చి తెలంగాణ ప్రజలను కేసీఆర్ కడుపులో పెట్టుకుని చూసుకున్నారని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. రైతులకు అండగా రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ లావణ్య రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రగౌడ్ , నాయకులు తిరుపతిరెడ్డి, గాలి అనీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

# నిషేధిత అల్ప్రాజోలం పట్టివేత

- రూ.74లక్షల విలువ గల ముడిసరుకు స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు, రెండు కార్లు సీజ్
- మీడియాకు వివరాలు వెల్లడించిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి అర్బన్ 27: సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామంలో పెద్దఎత్తున నిషేధిత అల్ప్రాజోలం డ్రగ్స్ ముడి సరుకును పట్టుకున్నామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్ బుధవారం మీడియాకు తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా ఓయో రూం అద్దెకు తీసుకొని అల్ప్రాజోలం ముడి సరుకును కొన్ని రసాయనాలతో కలిపి మత్తుమందు తయారు చేసి పేద, మధ్యతరగతి వారికి విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారంతో జిల్లా పోలీసులు, స్పెషల్ ఆపరేషన్ టీం దాడులు చేసిందని ఎస్పీ చెప్పారు. నిందితుల నుంచి కొన్ని రసాయన పదార్థాలు, అల్ప్రాజోలం పట్టుకున్నామని, దీని విలువ సుమారు రూ.74 లక్షలు ఉంటుందన్నారు. నలుగురు నిందితులు వీరిలో బ్రహ్మానందగౌడ్, చిరుగూరి డేవిడ్, కొండాపురం శివను అరెస్ట్ చేశామని ఎస్పీ రూపేశ్ తెలిపారు. బ్రహ్మానందగౌడ్, డేవిడ్‌కు 2018లో డ్రగ్స్ కేసులో జైలు శిక్ష పడిందన్నారు. వీరిద్దరూ జైలులో కలుసుకొని బయటికి వచ్చిన తర్వాత కల్లులో కలిపే అల్ప్రాజోలం యూనిట్‌ను ప్రారంభించారని తెలిపారు. రెండేండ్ల కిందట బెయిల్‌పై వచ్చిన బ్రహ్మానందగౌడ్ పటాన్‌చెరుకు చెందిన డేవిడ్ కుటుంబసభ్యుల సాయంతో 6 నెలల కిందట యూనిట్‌ను ప్రారంభించారని ఎస్పీ చెప్పారు. ఓ కంపెనీలో కెమిస్ట్‌గా పని చేస్తున్న కొండాపూర్‌కు చెందిన శివకుమార్‌ను నియమించుకొని అక్రమ దందా చేస్తున్నారన్నారు. ఈ మధ్యకాలంలో అనేక మంది యువతీయువకులు డ్రగ్స్, గంజాయికి అలవాటుపడి అనేక నేరాలు చేస్తున్నారని, ఎవరైనా డ్రగ్స్, గంజాయి అమ్మినా, తయారు చేసినా, కొన్నా వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ రూపేశ్ హెచ్చరించారు. ఎవరైనా డ్రగ్స్ వాడినట్లు తెలిస్తే సంగారెడ్డి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో డీఎస్పీ రమేశ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శివలింగం, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

సిద్దిపేట జిల్లాలో నేటి నుంచి

# 'ప్రజాపాలన'

**జనవరి 6 వరకు కార్యక్రమం**

**సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్**



సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట, డిసెంబర్ 27: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 499 గ్రామపంచాయతీలు, ఐదు మున్సిపాలిటీల్లోని 114 మున్సిపల్ వార్డుల్లో షెడ్యూల్ ప్రకారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రభుత్వ గ్యారెంటీలైన మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామపంచాయతీల వారీగా కార్యక్రమ షెడ్యూల్‌ను ప్రదర్శించామని తెలిపారు. ప్రతి మండలంలో ఈ కార్యక్రమం ద్వారా దరఖాస్తులను స్వీకరించేందుకు 2 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎంపీడీవో నేతృత్వంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్, ఏపీవో, ఏపీఎం, ఏఈ ఎలక్ట్రిసిటీ, ఎంఎవో తదితరులతో ఒక బృందం, తహసీల్దార్ నేతృత్వంలో మండల పంచాయతీ అధికారి, సర్వేయర్, స్టాటిస్టికల్ అధికారి, ఎంఈవో, మెడికల్ ఆఫీసర్ తదితరులతో మరో బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు 2 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తుల ను స్వీకరిస్తామన్నారు.

**కుటుంబానికి ఒక దరఖాస్తు..**

కుటుంబానికి ఒక దరఖా స్తు చొప్పున అన్ని దరఖాస్తులను గ్రామపంచాయతీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు తో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డును జతపర్చాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున, మహిళలకు ప్రత్యేకంగా, ఇతర దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. దరఖాస్తు స్వీకరణ అనంతరం దరఖాస్తుదారులకు రసీదులను ఇస్తామని తెలిపారు. ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమం నిర్వహణ రోజు దరఖాస్తు చేసుకోనివారు జనవరి 6వ తేదీ వరకు గ్రామపంచాయతీలో పంచాయతీ సెక్రెటరీకి దరఖాస్తులను అందజేయవచ్చన్నారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారి, ప్రతి మండలానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి హుస్నాబాద్ ఆర్డీవో బెనిషాలెం, సిద్దిపేట నియోజకవర్గానికి సిద్దిపేట ఆర్డీవో రమేశ్ బాబు, గజ్వేల్ నియోజకవర్గానికి గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, దుబ్బాక నియోజకవర్గానికి డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య, జనగామ నియోజకవర్గ పరిధిలోని మండలాలకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీరామ్‌రెడ్డిని నియమించామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.